కథ

తోడొకరుండిన...

— కవిరాయని

అదొక పల్లెటూరు. పల్లెటూరంటే మరీ పల్లెటూరు కాదు. చిన్నసైజు పట్నంలానే ఉంటుంది. ఆ ఊరికి ఫణిభూషణ్ మోతుబరి రైతు. ఓ పాతికెకరాలకు యజమాని.

ఆ ఊర్లో ఫణిభూషణ్ ఇల్లే పెద్ద డాబా ఇల్లు. లంకంత కొంప. ఫణిభూషణ్‌కి ఆ చుట్టు పక్కల ఊళ్లో మంచి పలుకుబడి ఉంది.

ఫణిభూషణ్‌కి డబ్బంటే మాత్రం మహా ప్రీతి. ఆయనకి ముగ్గురమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు.

పెద్దమ్మాయి లలితని పక్కవూరే ఇచ్చాడు. అతనూ వ్యవసాయదారుడే. మంచి ఆస్తిపరుడు. ఫణిభూషణ్‌కి చిన్నప్పట్నుంచీ స్నేహితుడు కూడానూ. అందుకనే ఇచ్చాడు. ఇద్దరబ్బాయిలకు పెళ్లి చేసేశాడు. ఇద్దరూ విజయనగరంలో సెటిలయ్యారు. కలిసి వ్యాపారం చేస్తున్నారు.

రెండో అమ్మాయి వనజకు పెళ్లి చేయాలి. మూడో అమ్మాయి గిరిజ ఇంకా ఇంటర్‌మీడియట్ చదువుతోంది కాబట్టి పెళ్లికి అంత తొందర్లేదు.

ఫణిభూషణ్ వయసు పైబడటం వల్ల ఇంతకు మునుపన్నంత చురుకుగా ఉండలేకపోతున్నాడు. రెండో అమ్మాయి వనజ ఆయనకి సాయం చేస్తుంటుంది. డిగ్రీ వరకు చదువుకుంది. అందుకే వనజంటే ఫణిభూషణ్‌కి ఎంతో ఇష్టం.

ఇంటి పనులు, వచ్చిన డబ్బు ఇంట్లో దాయడం, పాలేర్లకు జీతాలు, పాల లెక్కలు ఒకటేమిటి మొత్తం అన్ని విషయాలు వనజే చూసుకుంటుంది.

అన్నదమ్ములిద్దరూ విజయనగరంలో వ్యాపారం చేసి బాగా గడించారు. డబ్బు ఎంత పనైనా చేస్తుంది. దానివల్లే ఇద్దరి మధ్యా చిన్న చిన్న తగాదాలు వచ్చి ఇద్దరూ వేరు పడిపోయారు.

ఫణిభూషణ్ వనజ పెళ్లి విషయమై అబ్బాయిలిద్దరికీ కబురు చేశారు. వనజకు తొందరగా ఒకింటిదాన్ని చేస్తే తన బరువు తీరిపోతుందని చెప్పారు.

★★★

నీలకంఠంకి దాదాపు ఏభై ఏళ్లు పైనే ఉంటాయి. ఏకాకి. భార్యపోయి చాలాకాలమైంది. ప్రతాప్ ఒక్కడే కొడుకు. అతను కూడా ఉద్యోగ రీత్యా బొంబాయిలో ఉంటున్నాడు. ఇతను మాత్రం విజయనగరంలో పెద్ద ఇల్లు కట్టుకున్నాడు. అందులో ఒక్కడే ఉంటాడు. ఎంగిలి చేత్తో కాకిని కూడా కొట్టడు. పరమ లోభి.

లక్షలకు లక్షలు ఆస్తి బ్యాంకులోనే మూలుగుతూ ఉంటుంది. చుట్టాలు ఎవరూ ఇతనింటికి రారు. ఇతను ఎక్కడికీ పోడు. మనిషి ఎప్పుడూ అడుక్కునే వాడిలానే ఉంటాడు. పావలా దగ్గర్నుండీ లెక్క వేస్తుంటాడు.

కొడుక్కి ఏదైనా వ్యాపారం చేద్దామని ఉండేది. కానీ డబ్బంతా తగలేస్తాడేమో అని నీలకంఠం భయం. అందుకే వ్యాపారానికైతే ససేమిరా అన్నాడు. ఒక్కడివే కదా నేను అంత దూరం వెళ్లి ఉద్యోగం చేస్తే నిన్నెవరు చూస్తారు అంటే వినడు. ఉద్యోగం మానేస్తే నా దగ్గరకొస్తే ఆస్తి అంతా ఏ అనాధాశ్రమానికో రాసేస్తానని భయపెడుతూ ఉంటాడు.

కొడుక్కి పెళ్లి చేయాలి. కట్నం డబ్బులు బాగా రావాలి. అందుకే మంచి సంబంధం కోసం నీలకంఠం ఎదురు చూస్తున్నాడు.

★★★

నీలకంఠం కొడుకు ప్రతాప్ ఏదో గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడని, నీలకంఠానికి బాగా ఆస్తి ఉందని ఫణిభూషణ్‌కి తెలిసి అదే ఊర్లో ఉంటున్న కొడుకులకు ఉత్తరాలు రాశాడు. వనజకి ఈ సంబంధం అయితే బావుంటుందేమో చూడమని.

పెద్ద కొడుకు నీలకంఠం ఇంటికి వెళ్లి విచారించాడు. పెళ్లి ప్రస్తావన తెచ్చి తన చెల్లెలి గురించి చెప్పాడు. నీలకంఠం మంచి రోజు చూసుకుని అమ్మాయిని చూడ్డానికి వస్తామన్నాడు. ఈలోగా కొడుక్కి కూడా ఉత్తరం ముక్క రాస్తానన్నాడు.

★★★

ఒక మంచి రోజు చూసుకుని నీలకంఠం, కొడుకు ప్రతాప్ ఫణిభూషణ్ ఇంటికి వెళ్లారు. ప్రతాప్‌కి వనజ మొదటి చూపులోనే బాగా నచ్చింది. కానీ తండ్రంటే భయం. ఏమీ మాట్లాడకుండా కూచున్నాడు.

నీలకంఠానికి కూడా అమ్మాయి కన్నా ఇల్లు, అబ్బాయికి ఫణిభూషణ్ ఇచ్చే లక్షల కట్నం ఇంకా అమ్మాయి పెట్టుకున్న నగలు బాగా నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాడు.

ఇంకేముంది ముహూర్తాలు అవీ పెట్టుకుని మళ్లీ వస్తాం అని చెప్పి నీలకంఠం వెళ్లిపోయాడు.

ఈలోగా ఫణిభూషణ్ స్నేహితుడు ఒకడు నీలకంఠం గురించి ఏదో ప్రస్తావన రావడంతో అతని గురించిన విషయాలు చెప్పడంతో ఫణిభూషణ్ తన కూతురు సుఖపడుతుందో? లేదో అన్న సందేహం వెలిబుచ్చారు.

నీలకంఠం చచ్చాక ఆస్తంతా ఉన్న ఒక్కగానొక్క కొడుక్కే కదా వస్తుంది, అదీగాక అతను ఇంకెన్నాళ్లో బతకడు కూడా అని కొడుకులు ఫణిభూషణ్‌ని ఒప్పించడంతో ఆయన సరిపెట్టుకున్నారు.

ఒక శుభ ముహూర్తాన ప్రతాప్‌కి, వనజకి పెళ్లయిపోయింది.

★★★

భార్యను కాపురానికి బొంబాయి తీసుకువెళతానన్నాడు ప్రతాప్. నీలకంఠం తనకి కొద్దిగా సుస్తీగా ఉందని కొత్త కోడలని తన ఇంట్లో కొన్నాళ్లు ఉంచమని కొడుకుని అడిగాడు.

నీలకంఠం అడిగాడంటే అది అక్షరాలా అమలు జరుగుతుంది. ఎందుకంటే ఆయనంటే కొడుక్కు భయం కాబట్టి. లేకపోతే ఆస్తంతా ఎవరికో రాసేస్తే తనకి చిల్లి గవ్వకూడా దక్కదని.

ఇంకేముంది వనజ మామగారికి సేవలు చేస్తూ ఉండిపోయింది. భర్తకి చెపుదామనుకుంది తను కూడా బొంబాయి వస్తానని. కానీ ప్రతాప్‌కి తండ్రంటే ఎంత భయమో తెలిసింది కనక మిన్నకుంది.

నీలకంఠానికి ఒంట్లో బాగోలేక పోవడమంటే ఏదో పెద్ద జబ్బు చేసిందని కాదు గానీ చిన్న జ్వరంలాగా వచ్చింది. భార్య పోయినాక వంటలు అవీ సరిగా చేసేవాళ్లు కరువయ్యారు. ఇప్పుడు కోడలు చేత అవన్నీ చేయించి తినాలని అతని కోరిక. అందుకని తనకి ఒంట్లో బాగోలేదని కోడల్ని ఇక్కడే ఉంచేశాడు నీలకంఠం.

వనజకి మామగారి దగ్గర ఒకటే నరకం. కొత్తగా పెళ్లయింది. భర్త అక్కడ, తాను ఇక్కడ. పక్క వాళ్లతో మాట్లాడకూడదు. ఇంట్లో పనివాళ్లు ఉన్నారు. కానీ వాళ్లెవరితోనీ చనువుగా ఉండకూడదు.

వీధిలోకి ఏ గాజులవాడో వస్తే సరదాపడి కొందామనుకుంటే డబ్బు అనవసరంగా ఖర్చు చేస్తున్నావని నీలకంఠం తిడతాడు. ఇంట్లో ఒక్కర్తీ బిక్కు బిక్కుమంటూ ఉంటుంది. ఏమీ తోచదు. పోనీ అలా పక్కవాళ్లతో సినిమాకెళ్దామనుకుంటే అది కూడా ఒప్పుకోడు. ఇంట్లో టి.వి. ఉంది కదా అది చూసుకో చాలు అంటాడు.

★★★

సెలవు మీద ప్రతాప్ విజయనగరం వచ్చాడు. భార్యను తనతో పాటు తీసుకెళ్తానన్నాడు. నీలకంఠం కూడా ఏ ముఖాన్నున్నాడో సరే నన్నాడు.

వనజ బొంబాయి వెళ్లింది. భర్తకు ఆరువేలకు పైగా జీతం. కానీ ఉద్యోగ వేళలే నచ్చలేదు.

ఒకరోజు నైట్ డ్యూటీ. మళ్లీ ఇంటికొచ్చేసరికి కబురొస్తుంది డ్యూటీకి రమ్మని. ఇంకోసారి ఉద్యోగ రీత్యా నెలరోజులకు పైగా టూర్‌లకు వెళుతుంటారు. పోనీ వనజని కూడా తీసుకెళతాడా అంటే అదీలేదు.

చిన్న ఇల్లు తీసుకున్నాడు. దానికే పదిహేను వందలు అద్దె. వనజ అదృష్టం కొద్దీ రెండిళ్లకి అవతల ఇంకో తెలుగువాళ్లు ఉన్నారు. కొద్దిగా కాలక్షేపం. వెళ్లిన మూడు నెలల్లో భర్త ఇంటి దగ్గరుండేది కొద్ది రోజులు మాత్రమే. అయినా సంతోషంగానే ఉంటోంది వనజ.

ఏదో కొత్త కాపురం మెల్లగా సాగుతోంది. మొదటి పండక్కి ఫణిభూషణ్ అల్లుడ్ని రమ్మని ఉత్తరం రాయటంతో వనజ, ప్రతాప్ ఫణిభూషణ్ ఇంటికి వెళ్లారు.

అల్లుడు రెండు రోజులు ఉండి సెలవు లేదని వనజని అక్కడే వదిలేసి వెళ్లాడు. తండ్రికి తన మామ గురించి అల్లుడి ఉద్యోగం గురించి తను పడుతున్న కష్టాలు గురించి చెప్పి భోరున ఏడ్చింది వనజ.

ఫణిభూషణ్ వనజని ఓదార్చి ఆ ముసలాడు రేపో మాపో గుటుక్కు మంటాడు. అంతవరకూ ఎలాగోలాగ ఓర్చుకుంటే గనక ఆస్తి మొత్తం నీదే కదా. అప్పుడు నీ భర్త ఈ పాడు ఉద్యోగం మానేసి ఏదైనా వ్యాపారం చేసుకుంటాడు. ఇద్దరూ సుఖంగా ఉండొచ్చు అని చెప్పాడు.

కాని వనజకి ఆ మాటలెందుకో రుచించలేదు. మామ అంత తొందరగా చచ్చిపోడు అనిపించింది.

వనజ చెల్లెలు గిరిజ మాత్రం మహా ఫాస్టు. నేనైతే ఆ నీలకంఠం గాడిని ఓరోజు రాత్రి పీకపిసికి చంపేద్దును అని చెప్పింది. కానీ వనజ అసలు సమాధానం ఇవ్వడానికే జంకుతుందే!

ఈలోగానే ప్రతాప్‌కి విజయనగరంలోనే ఇంకో ఉద్యోగం వచ్చింది. కానీ పదివేలు కట్టాలి. మంచి ఉద్యోగం. ట్రాన్స్‌ఫర్‌లు ఉండవు. మొగుడూ పెళ్లాలూ ఇద్దరూ హాయిగా విజయనగరంలోనే ఉండొచ్చు.

ప్రతాప్ తండ్రికి ఉత్తరం రాశాడు. పదివేలు కావాలని.

నీలకంఠం సంగతి మామూలే. నువ్వు గనక ఆ ఉద్యోగం రిజైన్ చేసి వస్తే మొత్తం ఆస్తిలో చిల్లిగవ్వ కూడా నీకు దక్కదు అని చెప్పాడు. పదివేలు తన దగ్గర లేవన్నాడు.

పోనీ వనజ తన తండ్రిని అడుగుతానంది. తండ్రి నుండి కూడా అదే సమాధానం. నీలకంఠం పోయాక ఈ వెధవ ఉద్యోగాలు ఎలాగూ నీ మొగుడు చెయ్యడు కదా! అందుకుని ఇంకొన్నాళ్లు ఇప్పుడున్న ఉద్యోగంలోనే ఉండమని చెప్పాడు.

వనజకి ఎక్కడలేని ఉక్రోషం వచ్చింది. సరే అని వైజాగులోని అన్నయ్యల దగ్గరకెళ్లి అడిగింది. ఇద్దరూ బాగా సంపాదించి ఆస్తులు గడించినా చెల్లెలి దగ్గరికొచ్చేసరికి తమకి వ్యాపారం అంత లాభసాటిగా లేదని అంత సర్దలేమని ప్రేమ ఒలకబోశారు.

★★★

నీలకంఠం తన ఇంటిపై ఫస్ట్‌ఫ్లోర్ కడుతున్నాని దగ్గరుండి చూసుకోవడానికి కోడల్ని పంపించమని ప్రతాప్‌కి ఉత్తరం రాశాడు.

వెంటనే కొడుకు వనజని విజయనగరంకి ప్రయాణం కట్టమన్నాడు. వెళ్లనంది. కానీ ప్రతాప్ వినిపించుకోలేదు. ఆస్తిలో మనకు వాటా ఇవ్వడు వెళ్లు అని చెప్పాడు. టూర్ నుండి మీరు వచ్చి రెండు రోజులే కదా అయింది. కొన్ని రోజులుండి వెళ్తాను అంది వనజ. అవేమీ వినిపించుకోలేదు ప్రతాప్.

మళ్లీ మామగారింటికి ప్రయాణమయింది వనజ.

తను ఎన్నో ఊహించుకుంది. పెళ్లవగానే భర్తతో ఎంతో హాయిగా, ఆనందంగా కాపురం ఉంటుందని కలలుకంది. అందరి భార్యల్లానే తను కూడా భర్తతో పాటూ ఆ ఊరూ ఈ ఊరూ తిరిగి చాలా ఆనందంగా ఉండొచ్చు అనుకుంది. కాని తన ఆశలన్నీ కలలుగానే మిగిలిపోయాయి.

నీలకంఠం ఎప్పటిలానే వనజ మీద రుసరుసలాడుతూనే ఉన్నాడు. చీటికీ మాటికీ వనజ చేసింది తప్పు అని దెబ్బలాడుతుంటాడు.

పక్కింటి అమ్మాయి పెళ్లికి వనజ ఇంట్లో ఉన్న నగలు వేసుకుని వెళితే నగలు ఉన్నవి పెట్టుకోడానికి కాదు, అవి నలుగురికీ చూపించనక్కరలేదు అని ఛడామడా తిట్టి నగలన్నీ తీసి మర్నాడే బ్యాంకు లాకర్లో భద్రంగా దాచి వచ్చాడు.

మామ ఎప్పుడు పోతాడా అని వనజ ఎదురు చూడ్డం తప్ప ఇంకేమీ చేయలేని నిస్సహాయత.

మామగారు ఎంత శాడిస్టో అర్థమయింది వనజకి. డబ్బు కోసం మనుషులు ఎందుకు ఇలా మారతారో అనుకుంది. తండ్రి ఏదంటే అదే అని గంగిరెద్దులా సమాధానం చెప్పే భర్త మీద కూడా వనజ మనసులో కొంచెం వ్యతిరేక భావం ఏర్పడింది.

★★★

నీలకంఠం ఇంటికి ఫస్ట్‌ఫ్లోర్ వేయడానికి శ్రీకాంత్ అనే కాంట్రాక్టర్ వచ్చాడు. అతను నీలకంఠానికి బాగా తెలుసు. అందువల్లే నీలకంఠం అతనికి ఆ పనిని అప్పగించాడు. శ్రీకాంత్ కాంట్రాక్టరే కాకుండా ఇంజనీర్ కూడా. తనే ప్లాన్‌లవీ వేస్తుంటాడు.

శ్రీకాంత్ చాలా మంచివాడు. ఎక్కువగా మాట్లాడడు. తన పని తాను చేసుకు పోతాడు.

నీలకంఠం ఏవో సామాన్లు తేవడానికని బజారుకెళ్లాడు. వనజ ఒక్కర్తే ఇంట్లో కూచుని ఏదో పుస్తకం చదువుతోంది.

వనజకి శ్రీకాంత్ పరిచయమయింది అక్కడే. మంచినీళ్లకని శ్రీకాంత్ వచ్చినపుడు అతన్ని చూసింది. అందగాడు. బావున్నాడు. చదువుకున్నవాడు. మితభాషి. మంచినీళ్లు తాగి గ్లాసు అక్కడ పెట్టి వెళ్లిపోబోయాడు.

ముందుగా వనజే అడిగింది అతని గురించి. తన వివరాలు చెప్పాడు శ్రీకాంత్. వెంటనే వెళ్లిపోయాడు.

ఇలా వనజకి, శ్రీకాంత్‌కి పరిచయం పెరుగుతూ వచ్చింది.

మధ్యలో మధ్యలో భర్తకి ఉత్తరాలు రాస్తూనే ఉంది. తను ఒక్కర్తీ ఇక్కడ ఉండలేకపోతున్నాని, వచ్చి తీసుకెళ్లమని.

కానీ ప్రతాప్ వినిపించుకోలేదు. ఇల్లు పూర్తయ్యేదాక తండ్రి అక్కడే ఉంచమన్నాడనీ, ఒకవేళ నువ్వు వచ్చేస్తే మనకు ఆస్తిలో చిల్లిగవ్వ కూడా రాదు అందుకు అక్కడే నువ్వు ఉంటే మంచిదని తిరుగు ఉత్తరం రాశాడు.

శ్రీకాంత్, వనజల స్నేహం బాగా పెరిగింది. ఒకరి విషయాలు ఒకరు మనసువిప్పి మాట్లాడుకోసాగారు. వనజ తన గురించి, మామగారి గురించి, భర్త గురించి అన్నీ విషయాలు చెప్పింది.

శ్రీకాంత్ కూడా తన గురించి చెప్పాడు. తనకింకా పెళ్లి కాలేదని, తల్లిదండ్రులకు తానొక్కడే కొడుకునని, ఆస్తి కూడా ఉందని చెప్పాడు. ఈమె పట్ల సానుభూతి కూడా చూపించాడు.

★★★

నీలకంఠం బయటికి ఎక్కడికో వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు. వనజ ఒక్కర్తే ఉంది. ఆరోజు శ్రీకాంత్ వచ్చాడు. తన మనసులోని మాటను చెప్పాడు. ఆలోచించుకోమన్నాడు.

ఆ రాత్రి వనజకు నిద్ర పట్టలేదు. చాలాసేపు ఆలోచించింది. ఈరోజుల్లో మనిషికి కావలసింది వేరొక మనిషి ప్రేమ కాదు. డబ్బు. డబ్బుంటే ఇంకెవ్వరూ అక్కరలేదు. తన భర్త కూడా అంతే. తండ్రికి తగ్గ తనయుడు. తండ్రి శాడిస్టు. తండ్రి మాటలకు చేతకాని దద్దమ్మలా తలూపుతూ ఉంటాడు. తనకు పెళ్లయి ఇన్ని నెలలయినా భర్తతో కేవలం కొద్ది రోజులు మాత్రమే ఉండగలిగింది.

కొత్తగా పెళ్లయిన ఏ అమ్మాయి అయినా ఇలాగా ఉంటుందా? వాళ్ల పెద్దలు కూడా ఇలాగే చూస్తారా? మనిషి ప్రేమకన్నా డబ్బును ఎక్కువగా ఆరాధించే ఈ మనుషులకంటే మంచి మనసున్న శ్రీకాంత్ లాంటి వ్యక్తి దగ్గరుంటే తనకెంతో బావుంటుంది.

ఎంత డబ్బున్నా కూడా శ్రీకాంత్ అలా కనిపించడు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడతాడు.

అందుకనే మర్నాడు శ్రీకాంత్ అడిగిన మాటను కాదనకూడదనే నిర్ణయానికి వచ్చింది వనజ.

★★★

అర్ధరాత్రి పన్నెండు గంటలయింది. అనుకున్న విధంగా వనజ సూట్‌కేసు తీసుకుని బయలుదేరింది. వీధి గుమ్మం వరకు అడుగులు వేసింది. ఇంతలో ఎవరో మూలుగుతున్న ధ్వని వినిపించి అటువేపు చూసింది.

అది నీలకంఠం గది. అంటే మామయ్యకు ఒంట్లో బాగోలేదా? రెండడుగులు వెనక్కి వేసి కిటికీలోంచి నీలకంఠం గదిలోకి చూసింది.

నీలకంఠం మంచమ్మీద ఉమ్మచుట్టుకు పోతున్నాడు. ఊపిరాడక, శ్వాస అందక మంచమ్మీద కళ్లు తేలేస్తున్నాడు. ఉక్కిరి బిక్కిరవుతున్నాడు.

కిటికీలోంచి ఈ దృశ్యాన్ని చూసిన వనజ మొహం పక్కకు తిప్పుకుంది. పీడ విరగడైపోతుంది అనుకుంది మనసులో.

అనడమైతే అనుకుంది కానీ ఆమె ఒక స్త్రీ. ఆమెలో ఎప్పుడూ మాతృ హృదయమే ఉంటుంది. మనసు మార్చుకుని వెంటనే సూట్‌కేస్ అక్కడ పడేసి మామయ్య గదిలోకి వెళ్లింది. చేత్తో గుండెలపై రాసింది. టేబిల్ మీద ఉన్న మందులను వేసింది. ఆ రాత్రంతా నీలకంఠానికి సపర్యలు చేస్తూనే ఉంది.

రెండు రోజులకు గానీ నీలకంఠం మళ్లీ మామూలు మనిషి కాలేకపోయాడు. ఈ రెండు రోజులూ నీలకంఠాన్ని దగ్గరుండి తల్లిలా సేవలు చేసింది వనజ.

★★★

నీలకంఠానికి వనజ సేవలతో తల్లి గుర్తుకొచ్చింది. వనజ లోటు గ్రహించాడు. ఓ నిర్ణయానికొచ్చాడు. మరుసటి రోజే కొడుకును పిలిపించాడు. వనజ చాలా ఆనందించింది.

శ్రీకాంత్‌ను వనజే ప్రతాప్‌కు పరిచయం చేయించింది. "మన పై ఫ్లోర్ కడుతున్నది ఇతనే. చాలా మంచి కుటుంబం. మంచి సంబంధం చూడండి. ఆయనా ఓ ఇంటివాడై పోతారు" అంది.

డబ్బు ఒక్కటే కాదు ఈ ప్రపంచంలో రక్తసంబంధం ఎంత బలమైందో శ్రీకాంత్‌కు, నీలకంఠానికి ఒకేసారి అర్థమైంది.

బతుకు కొందరికి వడ్డించిన విస్తరి. కానీ తినడానికి మనుషులుండరు. కొందరికి కుక్కలు చించిన విస్తరి. మెతుకు మెతుకుకు పోటీ. పొట్ట కూటికంటే కడుపు తీపికి కూడా పోటీ తప్పని కాలమిది. అనుబంధాలు, ఆప్యాయతల దారిలో కొందరివి విరబూసిన పూతోటలు - కొందరివి అడుగు కదలని ముళ్లబాటలు. బండ్లు ఓడలు ఓడలు బండ్లయ్యే జీవితాల్లో అన్నీ మన చేతిలో లేవు. అయితే చేతికి అందినపుడు అవకాశం చేజార్చుకోవడం అవివేకం. ఆప్యాయతానురాగాలు కూడా అంతే. నిలువెత్తు నగలు కూడా ఓ మంచిమాట ముందు వెలవెలబోతాయి.

వనజ కూడా ఓ మనిషే. కోరికలు లెక్కలేనన్ని. అయితే చివర ఆమె బతుకు పూలబాట అయింది. ముళ్లదారుల్లోనే మిగిలిపోయే వనజలెందరో శ్రీకాంత్‌కు, నీలకంఠానికి ఏం తెలుసు?